చారుచుకుపోతూవున్నదే—అదే నేనన్న పీత. దాన్ని వెంటాడించు" అన్నాను.

"అది పీతగాదు దొరా! సూర్యభగవానుడు! రోజూ ఆలా క్రుంకుతూనే వుంటాడు స్వామి! రోజూ ఆ స్వామిని పట్టుకోబోయి పట్టుకోలేక ముందుకుపడి విరిగి ముక్కలై పోతూనే వుంటుంది ఆలా ఆమూల ఆ కెరటం! ఎవరికీ దొరకని పెద్దపీత ఆ బింబం!" అన్నాడు నామాట మిక్కిలి రెట్టించి అమ్మహావృద్ధు.

వాని ఆకలిడొక్క లింకా లోపలకు దించుకుపోతువున్నా "సముద్రాని కెంత తీరని ఆకలో!" అని ఉచ్చైశ్రుతంగా అనుకున్నాడు.

కదలికరళ్ల ప్రతిబింబించినట్లే ఆ దయాళుని కళ్ల నోనిమేషం సాయం సంధ్యారాగం ప్రతిఫలించింది. ఉప్పొంలమంతా చిట్టిజాబిల్లి కితకితలెట్టినట్టు కిలకిలా నవ్వింది.

## ఉ ద్ధ త ఉ స్స రం

"వెలయంగ నశ్వమేధంబులు వేయును
వొక్క సత్యమును దుల నిడి—" అన్న

పద్యములోని తూనిక జాపకం వస్తుంది నాకు. రాణ్మహేంద్రవర నగరమునందు గొప్ప ప్రహరీమధ్యను నవీన నాగరకచిహ్నముగ నెలకొల్పబడిన పురవనము దాని యెట్టయెదుట సనాతన ఃదూఢివి విలసిల్లే విశాలమైదానమ్మీది పురాతన వటవృక్షము—రెండింటినీ తలపున గొన్నప్పు డోహో! ఎన్ని పురవనములైతే వొక్క ఆ వటవృక్షంతో సాటిరాగలవు అని దాన్నిగురించే యోజిస్తూ వుంటాను.

పురాతన వటవృక్షమ్మీది చిన్న ఉడుత! చిట్టిఉడుత! ముద్దొస్తూవున్న ఉడుత! ముచ్చటైన ఉడుత! మురిపెంపు కోర్కెల వుడుత! మోహనంపు చారల వుడుత! గుజ్జుతోక వుడుత! లేలేత వుడుత! క్రొంగ్రొత్త వుడుత!—ధాత ఎప్పుడు ఆ వుడుతను సృష్టించాడో గాని అప్పటికీ ఇప్పటికీ వొకేలాంటి అమాయకత్వము. అత్యంత నేవళీకము. అతిసునిశ్చితమైన స్వేచ్ఛ. చలాకీ కనబరుస్తూ ఆ వృక్షాన్ని ఆశ్రయించుకునివుంది.

కాని ఆ ఉడుత ఆ వటవృక్షమ్మీదనువుంది అని ఎవరున్ను అందాకా కనిపెట్టి యుండలేదు. వటవృక్షమ్మీది ఉడుతను కనిపెట్టడమనేది కష్టంకాదూ? అందులోనూ పురాతన వట వృక్షముమీది ఉడుతను తెలిసికోవడ మనేది విశ్వరూపంలో "ఎలెక్ట్రాన్" యొక్క ఉనికి ప్రతిష్ఠాపన చెయ్యడంలాంటిది.

చెట్టు "సువిశాల మిదం వృక్షం" అన్నట్టు విస్తరించు కొనివుంది. కొమ్మలు బాగా సాచి కొమ్మ లెక్కడికక్కడికే ఊడలు దిగి, ఆకులు బలిసి, పగడాల్లా పళ్లు పండి, ఈ వృక్షాని కెంతమాత్రమున్ను ఏవిధమైనలోటూ లేదు. దీన్ని ఆశ్రయించు కుని వస్తూపోతూవున్న పాంథజనుల కంతకన్నా లోపంలేదు. దీనిమీద గూళ్లుకట్టి కాపురాలు చేస్తూవున్న పక్షుల కసలే కొరత లేదు అన్నట్టు హెచ్చు భూప్రదేశాన్ని తన బాహుళ్యమైన నీడ చేతను ఆవరించుకొనివుంది. అడ్డదారి వొకటి దానిక్రిందనుంచి జర్రిగొడ్డు ప్రాకుడుగీతలా తేటతెల్లంగా అగపిస్తూవుంటుంది. ఏనాటిగీతో అది, లేక రోజురోజూ పడుతూవున్న గీతో అది? కేటాయించడం కష్టం. పాత అడుగుల్లో కొత్త అడుగు లంత నమ్మకంగా పడి ఏ నిమిషమునకానిమిషం స్నిగ్ధంగా జరిగిపోతూ

వున్న బాట అది. ఆ చెట్టుయొక్క ఆకుల కలవరంలో ఎన్ని కబుర్లు అతి రహస్యంగా కలిసిమెలిసి గాలికి విడివడ్డాయో చెప్ప శక్యంగాదు.

పాలసముద్రమ్మీదను సృష్ట్యాదిని పవళించియున్న చిన్నారి పొన్నారి చిరుబొజ్జపాపని వీపుక్రింది మర్రి ఆకు ఏ మర్రిచెట్టునుంచి కోయబడిందో ఆ మర్రిచెట్టుపండు ఆ ఆకుతో కలిసి విడివడ్డదై, దారిలో ఆకూ పండూ ఊడదీయబడ్డ సమయాన ఆ పండు ఈ స్థలమందు పడి క్రమక్రమంగా మొలకగా పరిణమించి ప్రకాశిల్లింది అని ప్రతీతి. అటువంటి అద్భుతమైన పుట్టు జ్ఞాన సాంప్రదాయం ఆ మహావృక్షమందు నిగూఢంగా వుండబట్టే నేటికిన్నీ దానిచివళ్లు తెల్లని మేఘశకలాల్లో కలిసిపోవడానికి ప్రయత్నించడం; ఆ వృక్షం తనయొక్క ప్రప్రథమ బీజావస్థలో తెలిసికొనివుండాలి—వటపత్రశాయి ఏలా పాలకడలియొక్క తెల్లని చిరుకరళ్ళు ఎర్రటి పెదవులమీదకు వచ్చి పడుతూవుంటే ఫెక్కసపాటున వెలలించాడో! ఆ దృశ్యం! ఓహో ఏం మహద్భాగ్యం ఆ వృక్షానిది!

మార్కండేయాలయంమీది ఋషుల రూపాలు అలా గచ్చూ వెల్లా ఆకారాలుగా మారకముందు, అసలు ఋషులు తమంతతాము వచ్చి ఆ చెట్టుక్రిందనే ఆసనములు వేసికొని తపస్సుచేసి సమాధివిలయం పొందినారట. సీతారామలక్ష్మణులు లౌత్తరేయ ప్రదేశం కడచి గోదావరీతీరానికి చేరుకొన్నప్పుడు ఆ చెట్టుక్రిందనే కొంతకాలం గడిపినారని వదంతి. "ఏది నా వరదలకు నిలబడివుంటే అదే వృక్షం. పంచతంత్రకావ్యంలోని బూరుగుచెట్టు నా తొలివరదకే చెల్లిపోయింది. ఇది ఎన్ని వరదల

కైనా చెక్కుచెదరకుండా వుంది" అని గౌతమీ ప్రవంతి అపు రూపంగా చుట్టేసుకొని మొన్న మొన్నదాకా ఊదలసందుల్ని నృత్యాలాపం చేసిందట!

మొన్న మొన్నటిదాకా, అనగా రాజరాజనరేంద్రునికి ముందు ఎన్నో శతాబ్దాలక్రితంమాట. అయితే రాజరాజనరేంద్రుడు తనయొక్క కోట నిర్మించడానిగ్గాను ఆలోచనచేసే సమయంలో యీ వృక్షం కొట్టివేయబడివుండలేదా అని పాఠకులకు సంశయం తట్టొచ్చు. నిజంగా తట్టదగ్గ సంశయంకూడాను అది. అవితే చెట్టు కట్టెదుట కళ్ళారా కనిపిస్తూ వున్నప్పుడు పాఠకు లలాంటి సంశయం పొందడం మంచిది కాదని నా విన్నపము.

సారంగధరుడు కాళ్లాగజ్జెలు చేతికి చిరతలు అని రామ భజన చేసికొన్న దాచెట్టుక్రిందేనట. మరిన్నీ పావురాల గుబా శింపులు తొల్త సారంగధరుడు వీనులవిందుగా విన్నది ఆ చెట్టు మీదేనట. చిత్రాంగి చూపులు సారంగధరునిమీది కప్రయత్నంగా వాలింది ఆ చెట్టు ఆకుల సందుల్నించేనట. సారంగధరుడు మొండిగా తెగ్గొట్టబడ్డరాత్రి గాఢాంధకారంలో రత్నాంగి తన కొడుకుని చూడ్డానికి వెళ్ళే సమయంలో "భద్రంతే" అని ఊర డిస్తూ మంచు కన్నీరు గార్చింది ఆ వృక్షందేనట.

నన్నయ ఘంటము అప్పటప్పట ఆ మహావృక్షమూలము నకు చేరమోపి ఆకాశమువంక ఆలోచనాదృష్టి సారించింది యీ చెట్టున బెరిగిన బదనికతీవెల వెంబన్నేనట.

కోటగుమ్మాలు, కోటకొమ్మలూ, పెకలించబడినా, కందకం పూడ్చబడినా, ప్రాసాదాలు కూలద్రోయబడి వాటిమీద బ్యాంకి బిల్డింగులు, కుళాయియంత్రాలు, కాలక్షేపపు క్లబ్బులూ

నిర్మింపబడినా, ఎన్నెన్ని రూపాలు తారుమారైనా ఇమ్మహావృక్ష మాలాగ్గానే నిల్చివుంది.

ఎందుకు? కడచిన సంవత్సరం చీరాల వాస్తవ్యుఁ డొకడు రైలుదిగి యీ చెట్టుప్రక్కనుంచిపోతూ అనుకున్నట్ట-" ఇలాంటి మహావృక్షం ఓ మర్రిచెట్టు మావూళ్లోనూ వుండేది. అది నిరిటి తుపానుగాలికి 'చార్‌కోల్లా' మాడిపోయి వూరుకుంది. దీన్ని చూస్తే అది జ్ఞాపకంవస్తూవుంది" అని కళ్ళనీళ్లకూడా కార్చాట్ట. ఈ మర్రిచెట్టు కా సమయాన్ని అమాట విన్నప్పుడు ప్రాణం ఝల్లుమన్నదట. కాని రాణ్మహేంద్రవరాన్ని వుండడాన్నిబట్టి అట్టి తుపాను విపత్తు తనకెన్నడూ కలగదని ఉత్తరక్షణమందే కుదుటబడిందట.

వారంరోజులు క్రిందట రిజర్వు పోలీసు కవాతుచేస్తూ తమతమ తుపాకు లీచెట్టుచుట్టూ ఆన్చినప్పుడు తనకు గార్డుకూడా బ్రహ్మాండంగా ఏర్పాటు అయివుంది. మరి ఫరవాలేదని మిక్కిలి సంతోషించిందటకూడాను.

అయితే వొనాటిప్పుడయం ఇంకా తెల్లారకుండానే వెయ్యి మంది కూలివాండ్రు వాడి గొడ్డళ్ళు వోచేత, అన్నము మూటలు వోచేత పుచ్చుకుని ఆ బహిరంగ ప్రదేశంలోనికి వచ్చి చెట్టుకేసి చూచేరు. చెట్టుక్రింద బాటసారులు వందమంది విడిచి నిదర పోతూ వున్నారు నిశ్చింతగా. బాటసారుల్ని లేవగొట్టలేక పోయి నారు కూలివాళ్లు. బాటసార్లు అందరూ లేచి వెళ్ళిపోయేవరకు వాళ్ళు ఆ కూలివాళ్ళు తమతమ గొడ్డళ్ళు అక్కడ పడవేసి తమ తమ అన్నమ్మూటలు ఆ చెట్టునీడను విప్పికొని హాయిగా భుజించేరు. ఆ చెట్టునుండి కోసి కుట్టుకున్న పచ్చని ఆకుదొప్పల్లో. తిరిగి గొడ్డళ్ల చేత బట్టేరు.

బాటసారి వొక్కడూ లేదక్కడ. చెట్టింక చూసేరు కూలీలు. లక్షలకొద్ది పక్షులు అపురూపంగా వ్రాలి చెట్టుకు ఆభర ణాలుగా కవిపిస్తూవున్నాయి. అందులోనూ పచ్చని చిలకలు, తెల్లని కొంగలు. నల్లని కోయిలలు రంగురంగులు చూపిస్తూ వికాసం వెలయిస్తూ వున్నాయి. కూలీలు తమతమ గొడ్డళ్ళు అక్కడ పడవేసి వచ్చినపని మరిచిపోయి చెట్టుమీద పక్షుల్ని చూడసాగేరు.

అంతలో మధ్యాహ్నం పడిపోతూవుంది. దూరాన్నుంచి చెట్టుమీదికి పేల్చినట్టు వో తుపాకిదెబ్బ ఢాంమ్మని వినిపించింది. లక్షపిట్టలూ గభీమని ఆ చెట్టు విడిచి దిక్కులేనట్టు ఎగిరిపోయి నాయి. కూలివాళ్లు కళవళపడుతూ గొడ్డళ్ళకోసం తడుముల్లాడుకో సాగారు. పేల్చేసిన తుపాకీ చేత వూచుకుంటూ దూరాన్నుంచి సార్జంటు తమకేసి వస్తూవుంటే కూలీలందరూ వణకిపోయినారు.

సార్జంటు కూలీలను సమీపించి "ఆ పక్షులకు ఆ చెట్టు ఆశ్రయంగావుంది. ఏలా కొట్టమా అని కాదూ? మీ రాలోచిస్తూ వున్నది ఈవరకూను? ఇప్పుడు తీరిందా మీ సంశయం? ఆచెట్టే ఆ పక్షులకు ఆశ్రయమైతే పక్షు లలా ఎగిరిపోవడానికి వీల్లేదు. దానిమీదనే వుండి నా తుపాకీదెబ్బకు చచ్చిపోయి వుండాలి చూచారా? లేవండి! కొట్టివేయండి చెట్టును" అన్నాడు. "మీ రీ చెట్టు వెంటనే కొట్టివేయకపోతే యిక్కడ యిది పోలీసు బారక్సులు కట్టడానికి అడ్డు. తెలిసిందా? వెంటనే కొట్టివేయండి" అని ఆజ్ఞాపించాడు.

సార్జంటు మాటలకు కూలీలు విరుత్తరులై గొడ్డళ్ళు పైకెత్తారు, చెట్టును తెగ నరకడానికి.

వెయ్యిగొడ్డళ్ళు! పడలేదింకా వొక్క గొడ్డలిపెట్టూ ఆ వృక్షమ్మీద. వీవడంలేదు గాలికూన ఏ పక్కనించీని. ఊపడం లేదు ఎవరున్నూ ఆ చెట్టును — జలజల రాలిపోసాగినయి ఎండాకులు. గలగల రాలి కింద రొదచేయసాగినయి. కూలీలు నిర్విణ్ణులై చూచేరు. కారణం కనిపెట్టలేకపోయినారు.

"బాబో! బ్రహ్మరక్షస్సు" అని కేకవేశారు, "బ్రహ్మరక్షస్సు లేదు దిమ్మరక్షస్సులేదు" అని బండీఫిరంగి వొకటి తెప్పించాడు సార్జంటు. అందులోకి మందు చొప్పించాడు సార్జంటు. ఫిరంగి చెట్టుకు గురివెట్టాడు సార్జంటు. రంధ్రావి కగ్గి ముట్టించడానికి సిద్ధంగావున్నాడు సార్జంటు. చూచారుకారు మీరు ఆ సమయాన్ని!

ఒక ఉడుత! చిన్న ఉడుత! చిట్టిఉడుత! ముద్దొస్తూవున్న ఉడుత! ముచ్చటైన ఉడుత! మురిపెంపు గోర్కెల వుడుత! మోహనంపుచారల వుడుత! గుజ్జుతోక ఉడుత! లేలేత వుడుత! క్రొంగ్రొత్త వుడుత! రెమ్మరెమ్మకు కొమ్మకొమ్మకు ఆకు ఆకుకు పండు పండుకు తానే అన్నట్టు. ఎటు ఫిరంగి తిప్పితే అటు దొరక్కుండా చెట్టంతా అలుముకుపోయినదానికి మల్లే రహగ్రమ్మి. తిరిగింది. పాకింది. ఉరికింది. తోక తన వీపుమీదికి నిక్కించి. చెవులెక్కవెట్టి మెరిసిపోయింది!

ఇసీ! ఉడుత! దయతలచకండి. వెయ్యండి గొడ్డళ్ళు చెట్టుమీదను అంటూ సార్జంటు ఫిరంగి అంటించాడు. ఫిరంగి మ్రోత గొడ్డళ్ళ వ్రేట్లు దిశలు పగల వినిపించినయి.

వినిపిస్తూ వున్నంతసేపూ చెట్టుమీది వుడుత పూర్వోక్త ప్రకారంగా క్రిందికీ మీదికీ నెత్తురుపారుదల్లా సంచరిస్తూనేవుంది.

ఎప్పుడెప్పుడు గొడ్డళ్ళ వ్రేట్లు ఆపీవారో, ఫిరంగిమోత ఎప్పు డెప్పుడు చాలించీవారో, అప్పుడప్పుడు ఆ వుడుత ఆగిపోయి కనిపించేదికాదు ఎవరికిన్ని తానెక్కడున్నదీ.

ఈ ఉడుత చావదర్రా అని సార్జంటు, ఈ ఉడుత మనల్ని కొట్టనివ్వదర్రా అని కూలీలు తమలో తాము అనుకొన్నట్టు ఒకరిమొగా లొకళ్లు చూచుకున్నారు. లేదు ఉడుత లేదంటే లేదు అని అనుకొనేవారు. తిరిగి నరుకు అగ్గిముట్టింపు ప్రారంభించేరు. మళ్లీ ఎప్పటి ఆటే ఉడుత! మళ్లి కూలీలు సార్జంటూ విరమించేరు.

ఆదేదో విడ్డూరంగా వుందని ఆబాల గోపాలం ఊరందరూ వచ్చి విరగబడిచూచేరు. చెట్టలా వుండవలసిందేకాని నరకబడ వలసింది కాదన్నారు. జనవాక్యమే కర్తవ్యమై యూరుకుంది.

వెయ్యిగొడ్డళ్లూ మూలబడ్డాయి. ఫిరంగి చల్లారి తుప్పు పట్టింది. కాని చెట్టుమాత్రం ఏటేటా చిగురుపట్టి యింపుగొల్పు తూనే వుంది యిప్పటికిన్నీ. దానిమీది నేటివుడుత—అదేనా? మరొకటా?

## కా రా గృ హ క వా ట ము

"నీవు దొంగచాటుగా నాకు ఇచ్చే ముద్దు నేను తీసికొనూలేను; నేను దొంగచాటుగా నీకు యీ చెట్టుయొక్క పువ్వు కోసియివ్వనూ లేను. నేను ఖైదీని; అస్వతంత్రుణ్ణి."

"నీవు దొరగారి తోటమాలివి కావూ? అస్వతంత్రుడివా?"

"ఈ దొరగారికి తోటమాలీలంటూ వేరేలేరు. దొంగలే తోటమాలీలు."